## క్లుప్తంగా

### వైభవంగా శత సహస్ర మోదక గణపతి హోమం

విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి, విదుశేఖర మహాస్వామి ఆదేశంతో శివరామ కృష్ణ క్షేత్రంలో 25 రోజులపాటు నిర్వహించే శత సహస్ర (లక్ష) మోదక లక్ష్మీగణపతి హోమం వైభవంగా నిర్వహించారు. సోమవారం నాటి కార్యక్రమాలు గణపతి పూజతో ప్రారంభమయ్యాయి. గణపతి అధర్వ శీర్షోపనిషత్ పారాయణం 4 వేల సంఖ్యగా మోదక హవనం నిర్వహించారు. ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ లక్ష్మీ హోమం వల్ల సకల శుభాలు కలుగుతాయని చెప్పారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొనవచ్చునని వివరాలకు దేవాలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

### పూర్ణాహుతితో ముగిసిన చవితి వేడుకలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకలు సోమవారం ముగిశాయి. సోమవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని నటరాజస్వామి వారి ఆలయ ప్రాంగణంలోని వినాయకుడి ఆలయంలో ఉదయం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో కెఎస్.రామరావు దంపతులు పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొనగా, ఆలయ వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం మృత్తికా గణపతికి నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించిన ఊరేగింపులో పలువురు ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్):వర్షాలు కురుస్తున్న దృష్ట్యా బుడమేరు ప్రవాహ ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ ఐపీఎస్ అధికారి మీనన్ సూచించారు. దేవీనగర్‌లో శుక్రవారం బుడమేరు వరద పరిస్థితిని సీఐ ముత్యాల సత్యనారాయణతో కలిసి పరిశీలించారు.

### కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

పటమట(విజయవాడ తూర్పు): బుడమేరు వరద ప్రభావితమైన 149 సచివాలయాల పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పూర్తి చేశామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల వరకు 66 సచివాలయాల్లో 100 శాతం పారిశుద్ధ్య పనులు చేశామన్నారు. పురపాలక పట్టణాభివృద్ధి శాఖ నుంచి 32 ఐఏఎస్ ఆఫీసర్లు, 149 మంది వార్డు సచివాలయ స్పెషల్ ఆఫీసర్లుగా, పారిశుద్ధ్య నిర్వాహణకు 60 మంది నోడల్ ఆఫీసర్లు, 950 శానిటేషన్ సూపర్‌వైజర్లు, 6,830 పారిశుద్ధ్య కార్మికులతో ప్రతి రోజు వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు శరవేగంగా చేస్తున్నారన్నారు. ఆయన సోమవారం వరద ప్రభావిత ప్రాంతాలైన ఒకటో డివిజన్‌లోని గుణదల ఇన్నర్ రింగ్ రోడ్డు, 64వ డివిజన్‌లోని కండ్రిక జంక్షన్‌లో పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వరద ప్రభావిత ప్రాంతాల్లో 234 ట్యాంకర్లతో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణకు 154 ట్రాక్టర్లు, 100 టిప్పర్లు, 59 జేసీబీలు, 14 బాబ్ కాట్లు, 10 డోజర్లు, ఆరు ప్రొకెయిన్లు, రెండు క్రేన్లు, 25 కంపెక్టర్లతో మొత్తం 370 వాహనాలతో పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయన్నారు.

### శాలివాహనులను ఆదుకోవాలి

**మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య**

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరదల్లో నష్టపోయిన కుమ్మర (శాలివాహన) కుటుంబాలకు ప్రభుత్వం చేయూత అందజేసి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, ఆంధ్ర ప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం అధ్యక్షుడు ఐలాపురం వెంకయ్య సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వరదల్లో నగర ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఇళ్లలోకి నీళ్లు చేరి కట్టుబట్టలతో మిగిలారు. సర్వస్వం కోల్పోయారన్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో కుమ్మర శాలివాహన కులస్తులు అందరికంటే అధికంగా నష్టపోయారన్నారు. శ్రమతో తయారు చేసుకున్న కుండలు, మట్టి, కుండలు కాల్చే ఆమాలు ఈ వరదల్లో పూర్తిగా కొట్టుకుపోయాయన్నారు. కుమ్మర్లు తిరిగి జీవనం సాగించడానికి అవసరమైన ఆర్థిక సహాయం చేయాలని సీఎం చంద్రబాబును కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున కుమ్మర శాలివాహన కుటుంబాలకు ప్రత్యేక ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

### విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ డొంక రోడ్డు సాయినగర్‌లో వినాయక చవితి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మేళతాళాలు డప్పు వాయిద్యాలతో వినాయక నిమజ్జనం జరిగింది.

# కండ్రిక కడు దయనీయం..



వరదనీటిలో గృహాలు

- నేటికీ జల దిగ్బంధంలోనే
- అవస్థలు పడుతున్న ప్రజలు
- సహాయక కార్యక్రమాలు అంతంత మాత్రమే

పాయకాపురం(విజయవాడరూరల్): అత్యంత నిరుపేదలు, రోజువారీ కూలీ పనులు చేసుకునే వాళ్లు, కార్మికులు, సామాన్య కుటుంబాలు జీవనం సాగించే కండ్రిక ప్రాంతం పరిస్థితి కడు దయనీయంగా మారింది. తొమ్మిది రోజులుగా వరద నీటిలోనే స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు. పల్లపు ప్రాంతం కావడం, వరద నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో నేటికీ మనిషి లోతులో నీళ్లు నిలబడి ఉన్నాయి. దీంతో బాధితులు నానా బాధలు పడుతున్నారు. తిండీ తిప్పలు లేక అలమటిస్తున్నారు. మోటార్లతో నీటిని తోడిస్తే తప్ప వరద నుంచి బయటపడే పరిస్థితి లేదని అంటున్నారు. ఎటు చూసినా వరద నీరే కనిపిస్తోంది. బయటకు రావాలంటేనే భయమేస్తుందని అంటున్నారు. ఒక వేళ ఇళ్లలో నుంచి బయటకు వచ్చినా తమను సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లే వాళ్లు లేరని కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వ సహాయం కూడా రోడ్డు పక్కన ఉన్న ఇళ్లకే అందుతుంది తప్ప లోపలకు వచ్చి అందించడం లేదని ఆవేదన చెందుతున్నారు. తమ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని వాపోతున్నారు.

**ముంపు విలయతాండవం...**

నగరానికి శివారులో ఉన్న 64వ డివిజన్ కండ్రిక ప్రాంతం గత 9 రోజులుగా జలదిగ్బంధంలోనే ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలు ఉధృతంగా వచ్చిన వరదలతో కండ్రికలో ముంపు విలయతాండవం చేస్తోంది. దాదాపు పది రోజులపాటు కండ్రికలోని గృహాలన్నీ బుడమేరు వరదలో నానుతున్నాయి. ముందెన్నడూ రానివిధంగా ఆ ప్రాంతాన్ని వరద ముంచెత్తడంతో అక్కడ ప్రజానీకం తిండితిప్పలు లేక అర్తనాదాలు చేస్తున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే మార్గం లేక వచ్చిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే వారు రాకపోవడంతో ఇళ్లలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పాతపాడు-కండ్రిక రోడ్డు కూడా బుడమేరు వరదతో ఇప్పటికే పరవళ్ళు తొక్కడంతో ఎటూ వెళ్లటానికి వీల్లేక నరకం అనుభవిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలు చేయలేక చేతులెత్తేయడంతో సహృదయంతో నున్న, పాతపాడు, విలేజి కండ్రిక, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఇతర గ్రామాల నుంచి దాతలు అష్టకష్టాలు పడి వరదల్లో ట్రాక్టర్ల పై తీసుకొచ్చే అన్నపానీయాలు సేవిస్తున్నారు.

**కొట్టుకుపోయిన గృహోపకరణాలు....**

కండ్రికలో నివసిస్తున్న ప్రజానీకం అంతా రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు కావడంతో రూపాయి రూపాయి కూడబెట్టుకొని సంపాదించుకున్న గృహోపకరణాలు మొత్తం వరదలో కొట్టుకుపోయాయి. కొన్ని పూర్తిగా తడిసి ఉపయోగంలో లేకుండా ఉన్నాయి. పెద్ద మొత్తంలో ఆ ప్రాంత ప్రజలు వరదల కారణంగా నష్టపోయారు. సమీపంలో వున్న డాబాల్లో బాధితులు తలదాచుకొంటున్నారు. కట్టుబట్టలతో బయటకు వచ్చిన ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందితో సహాయ చర్యలు చేపడుతున్నామని చెప్పుతున్నా మెయిన్‌రోడ్డు పక్కన వున్న వారిని పవర్ పడవల్లో తీసుకెళుతున్నారు తప్ప శివారు ప్రాంతాల్లో ఉన్న బాధితుల కోసం ఎవ్వరూ రాలేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు వరదల్లో వున్న ప్రజలను పట్టించుకోలేదని అంటున్నారు. రోజుల తరబడి ఇళ్లల్లో వున్న వరద నీటిని తొలగించాలని, ముంపునకు శాశ్వత నివారణ చూపాలని ఆ ప్రాంతంలోని బాధితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. వరదలో అనేక జంతు కళేబరాలు కొట్టుకురావడంతో అంటువ్యాధులు సోకుతాయని ఆందోళన చెందుతున్నారు. పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోందని వాపోతున్నారు.



వరద నీటిలోనే ఉన్న కండ్రికలోని నివాస గృహాలు



పాతపాడు-కండ్రిక రోడ్డులో వరద

# ముంపు ప్రాంతాల్లో కంపు



అజిత్‌సింగ్‌నగర్‌లో నిలిచిన మురుగు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో బుడమేరు ముంపు ప్రాంతాల్లో వరద తగ్గినప్పటికీ దుర్వాసన మాత్రం తగ్గటంలేదు. గత పది రోజులుగా బాధితులు ముంపులోనే ఉండటంతో ఇంట్లోని సామాన్లు కొన్ని కొట్టుకుపోగా మరికొన్ని ఎందుకూ పనికిరాకుండా పోయాయి. అలాగే, పాడైన వస్తువులు, అపరిశుభ్రంగా మారిన పరిసరాలు తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదంం ఉందని బాధితులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎస్టీ ప్రాంతాలకు రావాలని ఎన్నిమార్లు కోరినా పారిశుధ్య సిబ్బంది, ఫైర్ సిబ్బంది రావటంలేదని మండిపడుతున్నారు. వచ్చే అరకొర తాగునీరు, పాలు, ఆహార పొట్లాలతో జీవనం సాగిస్తున్నామని ఈ కష్టాలు ఇంకెంత కాలమో అర్థంకావటంలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెక్కల బజారు క్రాస్‌రోడ్డులో ఇంకా మురుగు, వరద నీరు ఉండడంతో పాటు దుర్వాసన వెదజల్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**వరద తగ్గినా వీడని దుర్గంధం**

గుణదల (విజయవాడ తూర్పు): వరద ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాల్లో బురద, మురుగునీరు సమస్యాత్మకంగా మారాయి. వరద నీటి కారణంగా ఇప్పటివరకు బంధువుల ఇళ్లకు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన స్థానికులు ఇప్పుడిప్పుడే తమ ఇళ్లకు చేరుకుంటున్నారు. పాత రాజీవ్‌నగర్, రాధానగర్ తదితర ప్రాంతాల్లో నీట మునిగిన ఇళ్లు బురదతో నిండిపోయాయి. గత వారం రోజులుగా పేరుకుపోయిన ఈ బురదను తొలగించేందుకు స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫైర్ ఇంజన్లు బాధితులకు అందుబాటులో ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన వీధులలో నామ మాత్రంగా ఫైర్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి సభ్యులందరూ కలసి ఓపిక తెచ్చుకుని తమ ఇళ్లను శుభ్రం చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఆయా కాలనీల్లో వరద నీరు పోయి ఇళ్లలోంచి వస్తున్న బురదతో పాటు డ్రైనేజీ మురుగు నీరు రోడ్ల పై పారుతోంది.

**దుర్గంధంగా కాలనీలు....**

ఆయా కాలనీలు తీవ్ర దుర్గంధంగా మారాయి. దుర్వాసనతో కూడిన వాతావరణంలోనే స్థానికులు కాలం గడుపుతున్నారు. ఎక్కడ చూసినా మురుగు నీరు, మేటలు వేసిన బురదే దర్శనమిస్తోంది. తీవ్ర అసౌకర్యం మధ్య స్థానికులు ఇబ్బందులు పడుతున్నా పారిశుధ్య సిబ్బంది కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త, వ్యర్థాలను తొలగించడం గానీ, మురుగునీరు దారి మళ్లించే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయటం గానీ జరగటం లేదని చెబుతున్నారు. శ్వాస కూడా తీసుకోలేనంత దయనీయంగా తమ పరిస్థితి ఉందని తెలియచేస్తున్నారు. మరి కొన్ని రోజులు ఇలానే ఉంటే బాధితులు రోగాల బారిన పడక తప్పదని ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆయా కాలనీల్లో పారిశుధ్య పనులు మెరుగు పరచాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

### డీజే బాక్సులు కొట్టుకుపోయాయి



నేను ఈవెంట్స్ చేస్తుంటాను. ఆదివారం ఒక్కసారిగా వచ్చిన వరదతో సుమారు రూ.70 లక్షల విలువైన డీజే బాక్సులు, పరికరాలు వరద నీటిలో కళ్ల ముందే కొట్టుకుపోయాయి. అలాగే ఇంట్లోని సామాన్లు నీటిపాలయ్యాయి.

– ఎండీ బాషా, అజిత్‌సింగ్‌నగర్

### చెత్త తొలగించడంలేదు



నిరుపేదలమైన మా ప్రాంతాలకు ఫైర్ సిబ్బంది రావటం లేదు. దీంతో మా ఇంటిని మేమే శుభ్రం చేసుకుంటున్నాం. కనీసం పారిశుధ్య సిబ్బంది సైతం చెత్తచెదారం తొలగించటంలేదు. తాగు నీరు ఆహారం కూడా మెయిన్‌రోడ్డుకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది.

– బాలకోటయ్య, అజిత్‌సింగ్‌నగర్

### మెట్ల మీదే ఉన్నాం



ఒక్కసారిగా బుడమేరు వరద చుట్టుముట్టడంతో మా ఇంట్లోకి నీళ్లు వచ్చాయి. దీంతో నడవలేని నన్ను ఎదురింటి మెట్ల మీద కూర్చోపెట్టారు. మూడ్రోజుల పాటు మెట్ల మీదే ఉన్నాం. ఇంట్లో సామాన్లు పనికిరాకుండా పాడయ్యాయి. ఇంటిని మేమే శుభ్రం చేసుకుంటున్నాం.

– దుర్గ, వాంబే కాలనీ

### ఉచితంగా గ్యాస్ పొయ్యి రిపేర్లు

పటమట: భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో నవీన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా అజిత్ సింగ్‌నగర్‌లో ఉచిత గ్యాస్ రిపేరు శిబిరాన్ని ఏర్పాటు చేసింది. పొయ్యి స్పేర్‌పార్ట్స్, బర్నర్‌లు, నాబులు, జెట్‌లు, రబ్బర్ బుష్‌లు, స్ప్రింగిళ్లు ఉచితంగా వేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం 100 మందికి పైగా బాధితులు వచ్చారని నిర్వాహకులు ఇస్మాయిల్ తెలిపారు.



## వరద బాధితులకు 'అర్షి'ంచే సాయం..



వరద బాధితులకు ఆహార కిట్లు అందిస్తున్న చిన్నారి అర్షి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వరద బాధితులకు ఆదుకునేందుకు నేను సైతం అంటూ గుంటూరుకు చెందిన ఏడేళ్ల చిన్నారి ముందుకు వచ్చింది.. తన తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీతో పాటు మరికొంత డబ్బులు పోగుచేసి వరదల్లో చిక్కుకొని సర్వం కోల్పోయిన 200 మంది బాధితులకు ఆహారం కిట్లు తయారుచేయించి.. అందరి చేత 'అర్షి'ంచే సాయాన్ని అందించింది.

**ఫుడ్ కిట్లు తయారు చేయించి....**

గుంటూరు శ్రీనగర్ ప్రాంతానికి చెందిన అద్దేపల్లి అర్షి అనే చిన్నారి విజయవాడ వరదల గురించి ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకుంది. సింగ్‌నగర్ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వీక్షించిన ఆమె వారికి తనవంతు సహాయం అందించాలని నిర్ణయించుకుంది. దాని కోసం తన తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీ అంతటిని తీసింది. వరద బాధితులకు సాయం చేయాలనే తన నిర్ణయాన్ని చెప్పింది. దీంతో ఆ నగదు వినియోగించి తన తల్లిదండ్రుల సహాయంతో బియ్యం, పాలప్యాకెట్, బ్రెడ్, ఆపిల్స్, బిస్కెట్ ప్యాకెట్స్, వాటర్ బాటిల్ తదితర పదార్థాలు అన్నీ కలిపి 200 కిట్లను తయారు చేయించింది. సోమవారం సింగ్‌నగర్‌కు విచ్చేసి వరద బాధితులకు తన స్వహస్తాలతో అందించింది. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయాలనే మంచి మనస్సుతో చిన్నారి అర్షి చేసిన సాయాన్ని చూసి అధికారులు, ప్రజలంతా మెచ్చుకున్నారు. ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తితో వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు. అర్షితో పాటు డాక్టర్ సాయి ప్రసన్న, సాధిక్, గులాబ్‌ఖాన్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలంపాడులో దుప్పట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ శిరీషదేవి



దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ శేషగిరి, నెక్కంటి ప్రసాద్

## వరద బాధితులకు దుప్పట్లు, టవల్స్ పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్):వరద ముంపులో సర్వం కోల్పోయిన బాధితులకు సోమవారం ముత్యాలంపాడులో మహారత్న ఎంటర్‌ప్రైజెస్, హెచ్ఎంసీ ట్రస్ట్ ఆధ్వర్యాన దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శిరీష దేవి ముఖ్య అతిథిగా పాల్గొని బాధితులకు దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు తోచినంతలో సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత చందు శ్రీనివాసరావు హెచ్ఎంసీ ట్రస్ట్ ప్రెసిడెంట్ యు సీతారామరాజు , కంటే విజయ్, రాముడు , రామారావు తదితరులు పాల్గొన్నారు. మధురానగర్ గౌతమ పాఠశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఇంపాక్ట్ ఆధ్వర్యంలో వరద బాధితులకు దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ శేషగిరి, రీజియన్ చైర్మన్ బలుసు శ్రీనివాస్, జోన్ చైర్మన్ శ్యాంప్రసాద్, జీఎల్‌టీ కోఆర్డినేటర్ నెక్కంటి వీరవెంకట సత్యవరప్రసాద్ పాల్గొని బాధితులకు దుప్పట్లు అందజేశారు.

**నిత్యావసర సరుకులు పంపిణీ....**

బుడమేరు వరదలతో సర్వం కోల్పోయిన మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో వృద్ధులకు సోమవారం బీసీ సంఘం సంక్షేమ సంఘం నాయకులు వీరంకి గోకర్ణేశ్వరరావు, నరవ దుర్గాప్రసాద్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరద సమయంలో తమ వంతు బాధ్యతగా వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బి.వసంతకుమార్, కె.రాము, రాంబాబు, జ్ఞానేంద్ర, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

**యూనియన్ బ్యాంక్ వితరణ....**

వరద ముంపుతో అల్లాడుతున్న వరద బాధితులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అండగా నిలవటం అభినందనీయం అని ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వర రావు అన్నారు. శాంతినగర్‌లో సోమవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన వరద బాధితులకు దుస్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొని దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ సేవలను కొనియాడారు. యూనియన్ బ్యాంకు జోనల్ హెడ్ సీవీఎన్ భాస్కర్ మాట్లాడుతూ తాము సామాజిక బాధ్యతగా 500 మంది వరద బాధితులకు చీరలు, పంచిలు, నిత్యావసర సరుకులు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తాము బాధితులకు ఆహారం తాగునీరు అందిస్తున్నామని పేర్కొన్నారు. వరదలో దెబ్బతిన్న పాఠశాలలకు అవసరమైన సహకారం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ డిప్యూటీ జోనల్ హెడ్ ఎ.శారద, రీజనల్ హెడ్ ఎం.శ్రీధర్, హరీష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

**దుప్పట్లు, సరుకులు అందజేత**

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలోని వరద బాధితులకు రోటరీ మిడ్‌టౌన్ చేయూత అందించింది. పది రోజులుగా తిండి, తాగడానికి నీళ్లు లేక, విద్యుత్ సరఫరా లేక అల్లాడిపోతున్న బాధితులకు మేమున్నామంటూ ముందుకొచ్చి రోటరీ మిడ్‌టౌన్ సభ్యులు సేవలందిస్తున్నారు. కృష్ణలంక, రామలింగేశ్వరనగర్, సింగ్‌నగర్, పాయకాపురం, కబేళా సెంటర్, భవానీపురం తదితర ప్రాంతాల్లో వరద బాధితులకు సోమవారం దుప్పట్లు, ఫుడ్ ప్యాకెట్లు, పాల ప్యాకెట్లు, మంచినీరు, నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే రోగాలు ప్రబలకుండా కొన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమాల్లో మిడ్‌టౌన్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్, కార్యదర్శి సుందర్‌రెడ్డి, సలహాదారులు యడ్ల పార్థసారథి, స్వరూప, క్రిష్, తొండెపు ఉదయ్, కోనేరు మధు, సతీష్, కిరణ్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**న్యూ ఆర్ఆర్ పేటలో ...**

విజయవాడస్పోర్ట్స్: న్యూరాజరాజేశ్వరిపేటలోని వరద బాధితులకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగం దుస్తులు, మాస్కులను సోమవారం పంపిణీ చేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు సాయం చెయ్యాలని హైదరాబాద్‌లోని ఓ ఐటీ కంపెనీని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు కోరారు. స్పందించిన ఆ కంపెనీ సమకూర్చిన దుస్తులు, మాస్కులను న్యూఆర్ఆర్‌పేటలో బాధితులకు పోలీస్ సేవాదళ్ సిబ్బంది అందజేశారు.



సరుకులు పంపిణీ చేస్తున్న ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే బొండా, అధికారి సీవీఎన్ భాస్కర్



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దాతలు

# వరద బాధితుల సేవలో సీపీఎం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితులకు సీపీఎం ఆపన్నహస్తం అందించింది. గత ఆదివారం నుంచి సీపీఎం. దాని అనుబంధ సంఘాలైన సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సేవా కార్యక్రమాలు చేపట్టాయి. బాధితులను వరద ముంపు నుంచి కాపాడడమే కాకుండా వారికి భోజనం , వైద్య సేవలు అందిస్తున్నారు. ఇందుకోసం వరద ప్రభావిత ప్రాంతాలైన పైపులు రోడ్డు, వాంబే కాలనీ, రాజరాజేశ్వరి పేట, అజిత్‌సింగ్‌నగర్ కృష్ణా హోటల్ ప్రాంతంలో శిబిరాలు ఏర్పాటు చేసి నిత్యం భోజనం అందిస్తున్నారు. విద్యార్థి యువజన సంఘాలు పారిశుధ్య పనులు చేపట్టారు. పైపుల రోడ్డులోని శిబిరం వద్ద సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ బాధితులకు నేటికి ప్రభుత్వ సహాయం అందడం లేదన్నారు. అంచనాలకు మించి ఆస్తి నష్టం జరిగిందన్నారు. వరద ప్రాంతాల్లోని ఒక్కో కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం కింద రూ. 25వేలు అందించాలని డిమాండ్ చేశారు.



పైపుల రోడ్డులో ఏర్పాటు చేసిన శిబిరం వద్ద భోజనం అందిస్తున్న సీపీఎం

# అయ్యప్పస్వామి మందిరంలో చోరీ



మధురానగర్(విజయవాడ సెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే దుర్గాపురం అయ్యప్ప స్వామి మందిరంలో చోరీ జరిగింది. మందిరం గేటు తాళం పగులకొట్టి ఆలయంలోని సీసీ కెమేరాలు, డీవీఆర్ బాక్సు, హార్డు డిస్కులను దుండగులు ఎత్తుకువెళ్లారు. అలాగే హుండీని పగుల కొట్టి సొమ్ము దొంగిలించారు. గతంలో కూడా ఇక్కడ ఆలయంలోని గ్యాస్ సిలిండర్‌లు, గ్యాస్‌స్టవ్‌లు చోరీ అయ్యాయి. దీంతో ఆలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు సీసీ కెమెరాలను సైతం ఎత్తుకుపోవటం గమనార్హం. మందిరంలోని సోపా చినిగిపోయి గేటు తాళం పగులకొట్టి ఉందని మందిర వ్యవస్థాపకులు బల్లెం పూర్ణయ్యస్వామికి సమాచారం అందింది. దీంతో ఆయన మందిరానికి చేరుకుని పరీక్షించగా మందరింలోని హుండీ పగులకొట్టి ఉంది. అలాగే ఆలయంలోని సీసీ కెమెరాలు, డీవీఆర్, హార్డ్‌డిస్కులు మాయం అయ్యాయి. దీంతో ఆయన సూర్యారావు పేట పోలీసులను ఆశ్రయించారు.